క్లుప్తంగా

ఆయుష్మాన్ భవలో వైద్యసేవలు



ఆయుష్మాన్ భారత్ ర్యాలీలో పాల్గొన్న ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): గ్రామీణ ప్రజలకు కేంద్ర ప్రభుత్వఆయుష్మాన్‌భవ కార్యక్రమం ద్వారా వైద్యసేవలు అందిస్తోందని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత చెప్పారు. నగరంలోని వడ్డేగేరిలో ఉన్న డాక్టర్ వైఎస్‌ఆర్ ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆయుష్మాన్ భారత్ మేళా ర్యాలీలో ఆమె పాల్గొని ప్రసంగించారు. పేదల ఆరోగ్య రక్షణకు భరోసా కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా వైద్యపరీక్షలు, వ్యాధుల గుర్తింపు, ఉచిత మందులు, దీర్ఘకాలిక సమస్యలు ఉన్న వారిని గుర్తించి వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. ప్రతి కుటుంబానికి దేశవ్యాప్తంగా ఏ రాష్ట్రంలోనైనా రూ.5 లక్షల విలువైన ఆరోగ్య సేవలను పూర్తిగా అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ఆరోగ్య పథకాలు, వ్యాధుల గురించి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ హకీం, సిబ్బంది పాల్గొన్నారు.

కురువ సింహ గర్జనకు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య



కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను కలిసిన కురువ సంఘం నేతలు

కర్నూలు(అర్బన్): కర్నూలులో త్వరలో నిర్వహించనున్న కురువల సింహ గర్జన కార్యక్రమానికి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ హాజరయ్యేందుకు సానుకూలంగా స్పందించారని ఏపీ కురువ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఢిల్లీలోని కర్ణాటక భవన్‌లో ఇద్దరు నేతలను కలిసి కురువల రాజకీయ ప్రాధాన్యతకు సంబంధించి నిర్వహిస్తున్న గర్జనకు హాజరు కావాలని కోరినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీవిద్యార్థి యువజన సంఘం జాతీయ కార్యదర్శి కె. రామక్రిష్ణ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల కోఆర్డినేటర్ జోషి రాఘవేంద్రప్రసాద్, కురువ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ నుంచి హార్టికల్చర్ కార్యాలయం తరలింపు

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన శాఖను తాత్కాలికంగా కలెక్టరేట్ నుంచి బయటకు తరలించారు. జిల్లా పరిపాలనకు కేంద్రబిందువైన కలెక్టరేట్‌లోని పలు విభాగాలు పూర్తిగా దెబ్బతినడంతో సమూలంగా మరమ్మతులతో పాటు ఆధునీకరణ పనులకు జిల్లా కలెక్టర్ సృజన చర్యలు చేపట్టారు. మరమ్మతు పనులు కూడా మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఉద్యాన శాఖను తాత్కాలికంగా ఏ.క్యాంపులోని ఉద్యాన భవన్‌కు తరలించారు. ఏడీ రామాంజనేయులు, సిబ్బంది దాదాపు నెల రోజుల పాటు ఉద్యానభవన్ నుంచి విధులు నిర్వహిస్తారు. ఆధునీకరణ పనులు పూర్తి అయిన తర్వాత కలెక్టర్ అనుమతితో తిరిగి కలెక్టరేట్‌కు వస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు

కర్నూలు (టౌన్): ఈనెల 26 వ తేదీ నగరంలో వినాయక్‌ఘాట్ వద్ద గణేష్ నిమజ్జనోత్సవం నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై నగరపాలక సంస్థ అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ ఏడాది 2,200 విగ్రహాలను నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించారు. వాటి నిమజ్జనం సజావుగా సాగేందుకు 6 చోట్ల ఘాట్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే లైటింగ్ పనులు, మైక్ సిస్టమ్, ఘాట్లకు సున్నం వేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ప్రతి ఘాట్‌కు నలుగురు ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులను నియమించారు.

అంటరానితనాన్ని నిర్మూలించాలి



జీపు జాతాను ప్రారంభిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : సమాజంలో పాతుకుపోయిన అంటరానితనాన్ని నిర్మూలించాలని, వెనుకబడిన దళిత, గిరిజన వర్గాలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, భౌతికంగా ప్రోత్సాహం ఇవ్వాలని కేవీపీఎస్ ఉపాధ్యక్షులు పీఎస్ రాధాకృష్ణ, సీఐటీయూ జిలా ఉపాధ్యక్షులు గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. శుక్రవారం పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహం సమీపంలో కేవీపీఎస్, వ్యకాసల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దళిత రక్షణ యాత్ర జీపు జా తాను వారు ప్రారంభించారు. నాయకులు ఆర్.పెద్దబాబు, కేవీ నారాయణ, ఎండీ ఆనందబాబు, రామాంజనేయులు, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ పూజితా.. పార్వతీ తనయా

గణేష్ నవరాత్రి మహోత్సవాలు నగరంలో అత్యంత భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం ఆలయాలు, మండపాల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు వినాయకులను దర్శించుకున్నారు. మండపాల వద్ద నిర్వాహకులు భజనలు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

– కర్నూలు కల్చరల్






కుమ్మరిగేరిలో శివపార్వతులతో వినాయకుడు, వన్‌టౌన్ ఏరియాలో ఎడ్లబండిపై గణపతి, చిత్తారివీధిలో విఘ్నేశ్వరుడు, గౌరి వీధి వినాయక మండపం వద్ద మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు

ఇంతింతై..మహాకాయుడై!

వినాయక ఉత్సవం.. 43 ఏళ్ల ప్రస్థానం

- నగరంలో రెండు విగ్రహాలతో ప్రారంభమైన వినాయక ఉత్సవాలు
- ప్రస్తుతం సుమారు 2,200 విగ్రహాలతో నిర్వహణ
- రాష్ట్రంలోనే ప్రత్యేకం నిమజ్జనోత్సవ శోభాయాత్ర
- మత సామరస్యానికి ప్రతీకగా వేడుకలు



కురువ వీధిలో కొలువు దీరిన మహరాజ్ గణనాథుడు

కర్నూలు కల్చరల్: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో కర్నూలు నగరం రాష్ట్రంలోనే ప్రత్యేక స్థానంలో నిలుస్తోంది. ఇక్కడ గణేశ్ ఉత్సవాలకు 42 ఏళ్ల చరిత్ర ఉంది. 1980లో రెండు విగ్రహాలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 43వ సంవత్సరం వేడుకలు జరుగుతున్నాయి. మొదట మించిన్ బజార్, బుధవారపేటలో రెండు విగ్రహాలను ఏర్పాటు చేశారు. అ తర్వాత నుంచి ఏటేటా వినాయక విగ్రహాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 10 వేల విగ్రహాలను ఏర్పాటు చేయగా ఒక్క కర్నూలు నగరంలోనే సుమారు 2,200 వేల విగ్రహాలు కొలువుదీరాయి. ఇదిలా ఉంటే నగరంలో జరిగే గణేశ్ ఉత్సవాలు, నిమజ్జనోత్సవ శోభాయాత్ర కనుల పండుగలా జరుగుతుంది. నగరం నడిబొడ్డున కేసీ కాలువలో జరిగే నిమజ్జనోత్సవం రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అత్యంత వైభవో పేతంగా శోభాయమానంగా నిలుస్తుంది.

మట్టి వినాయక విగ్రహాలకే ప్రాధాన్యం..

కర్నూలు నగరంతో పాటు జిల్లాలోని చాలా ప్రాంతాల్లో మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. గతంతో పోలిస్తే మట్టి విగ్రహాల సంఖ్య ఈసారి భారీగా పెరిగింది. ఏర్పాటు చేసిన విగ్రహాల్లో సుమారు 50 శాతం ఆ విగ్రహాలే ఉన్నట్లు గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు పేర్కొంటున్నారు. నగరంలో సుమారు 30 వేల చిన్న విగ్రహాలను ఇళ్లలో పూజించినట్లు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు వాతావరణ కాలుష్య నియంత్రణ మండలి, కేంద్ర గణేశ్ మహోత్సవ సమితి, వివేకానంద స్టడీ సర్కిల్, శ్రీసాయినాథ్ పతంజలి యోగా కేంద్రం, భారత్ వికాస్ పరిషత్, వాసవీ ఏజెన్సీస్, మైపర్ తదితర స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పించడంతో పాటు విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయడంతో మార్పు చోటు చేసుకుంది. శ్రీ లక్ష్మీనరసింహ గణేశ్ ఉత్సవ సమితి వారు గత నాలుగేళ్లుగా తుంగభద్ర నది తీరంలో భారీ మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. 2018లో 51 అడుగులు, 2019లో 65 అడుగులు, 2022లో 54, ఈ ఏడాది 55 అడుగుల మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ భారీ లంబోదరుడిని దర్శించుకోడానికి భక్తులు భారీగా తరలి వస్తున్నారు.

మత సామరస్యానికి ప్రతీక కర్నూలు

నగరంలో మత సామరస్యం వెల్లివిరుస్తోంది. గతంలో మూడు ఏళ్ల వరుసగా వినాయక నిమజ్జనం, బక్రీద్ పండుగ, ఒక ఏడాది మొహరం, నిమజ్జనోత్సవం ఒకే రోజున జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా నగర వాసులందరూ సోదర భావంతో మెలిగి ఆ రెండు వేడుకలను విజయవంతం చేశారు. విగ్రహాల వెంట వచ్చే భక్తులకు ముస్లింలు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందజేయడంతో పాటు పలు చోట్ల అల్పాహారం సైతం అందజేశారు. ఈ సారి కూడా ఎలాంటి సమస్య లేకుండా ఉత్సవాలు ప్రశాంతంగా జరుగుతాయనే ఆశాభావాన్ని శాంతి కమిటీ ప్రతినిధులు, ఉత్సవ సమితులు సభ్యులు వ్యక్తం చేస్తున్నారు.

అందరి సహకారంతో..



కర్నూలులో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గత 42 ఏళ్లుగా ప్రశాంత వాతావరణంలో వేడుకలను నిర్వహిస్తున్నాం. ఇప్పుడు 43వ సంవత్సరం వేడుకలను జరుపుకుంటున్నాం. ఈ ఏడాది మట్టి వినాయక విగ్రహాల ఏర్పాటు బాగా పెరిగింది. పర్యావరణ పరిక్షణలో అందరూ భాగస్వాములు కావటం సంతోషంగా ఉంది. కాలుష్య నియంత్రణ మండలి, గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధుల సహకారంతో మట్టి విగ్రహాల వాడకం పెరిగింది.

– కె. క్రిష్ణన్న, జిల్లా అధ్యక్షుడు, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి

కర్నూలుకు ప్రత్యేక స్థానం



ఇక్కడ జరిగే వినాయక చవితి ఉత్సవాలకు ప్రత్యేక స్థానం ఉంది. రెండు విగ్రహాలతో మొదలైన వినాయక చవితి ఉత్సవాల ప్రస్థానం ఇంతింతై వటుడింతై అన్న చందంగా క్రమంగా 2,200 విగ్రహాల ఏర్పాటు వరకు విస్తరించింది. మట్టి విగ్రహాల ఏర్పాటు పెరిగింది. ప్రతి సంవత్సరం ఏదో ఒక కొత్త రకంగా కార్యక్రమాలు నిర్వహించుకుంటూ రాష్ట్రంలోనే ప్రత్యేకంగా నిలుస్తున్నాం.

– డాక్టర్ నాగఫణి శాస్త్రి, జిల్లా సంఘటనా కార్యదర్శి, గణేశ్ మహోత్సవ కేంద్ర సమితి

29న వరల్డ్ హార్ట్ డే వేడుకలు



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు నగరంలో ఈ నెల 29వ తేదీన ప్రపంచ హృదయ దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ చెప్పారు. ప్రపంచ హృదయ దినోత్సవ వాల్ పోస్టర్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎ.క్యాంపులోని హెల్త్‌క్లబ్‌లో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఫ్‌సీఎస్‌ఐ క్రిస్టియన్ మెడికల్ కాలేజి కార్డియాలజిస్టు డాక్టర్ జార్జ్ జోసఫ్ హాజరై జీవనశైలి మార్పులు, హృదయ సంబంధిత వ్యాధులు విజృంభించేందుకు ఎలా దారి తీస్తాయనే అంశమై సెమినార్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గౌరవ అతిథులుగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్, మాజీ జిల్లా కలెక్టర్ రామశంకర్‌నాయక్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజనల్ హెడ్ నాగేశ్వరరావు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ భవానీప్రసాద్, డాక్టర్ వసంతకుమార్, డాక్టర్ కల్కూర చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో మేలు



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం టోకెన్ అందజేస్తున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఆరోగ్యపరంగా ఎంతో మేలు జరుగుతుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన స్థానిక స్టాంటన్‌పురం యూపీహెచ్‌సీ పరిధి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఇంటింటి సర్వేని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి కార్యక్రమంపై అవగాహన కల్పిస్తారన్నారు. అనంతరం ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు ఇంటింటికి వెళ్లి అవసరమైన వారికి ఏడు రకాల ఆరోగ్యపరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలను జేఏఎస్ యాప్‌లో నమోదు చేస్తారన్నారు. ఆరోగ్యసేవలు అవసరమైన వారికి జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్ ఇచ్చి ఈ నెల 30వ తేది నుంచి విలేజ్ క్లినిక్/యూపీహెచ్‌సీలో నిర్వహించే వైద్యశిబిరాలకు తరలించి తగిన చికిత్సలు, ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. అనంతరం ఆయన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రజలు ఇళ్లు, పరిసరాల్లో నీటి నిల్వలు ఎక్కువ కాలం లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మొబిలైజర్ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

నకిలీ ఎయిర్‌టెల్ సిమ్ కార్డులపై ఫిర్యాదు

కర్నూలు (టౌన్): ఎయిర్‌టెల్ కంపెనీ పేరుతో ఒకటో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో నకిలీ సిమ్ కార్డులు విక్రయిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి వెంకట నారాయణ ఫిర్యాదు చేశారు. శుక్రవారం సీఐను కలిసి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

తనిఖీల్లో పట్టుబడిన మద్యం

కర్నూలు (టౌన్):పంచలింగాల చెక్‌పోస్టు వద్ద సెబ్ పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీలు నిర్వహించారు. అనుమానం ఉన్న ఓ వాహనాన్ని ఆపి సోదా చేయగా అందులో తెలంగాణాకు చెందిన 33 మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. ఆ కారులో ప్రయాణిస్తున్న మహా టీవీ చానల్ ప్రతినిధి, జమ్మలమడుగుకు చెందిన నిరంజన్ కుమార్, నరసింహారెడ్డిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

వినాయకుడి హుండీ చోరీ

కర్నూలు (టౌన్): వినాయకుడి వద్ద పెట్టిన హుండీని దొంగలు ఎత్తుకెళ్లారు. స్థానిక భాస్కర్ నగర్‌లో గణనాథుడిని ప్రతిష్ఠించారు. స్వామిని పూజించేందుకు వచ్చిన భక్తులు అక్కడ ఏర్పాటు చేసిన హుండీలో భక్తులు కానుకలు సమర్పించి వెళ్తున్నారు. వినాయకుడికి డబ్బులతో కూడిన దండను సైతం వేశారు. దీనిని గమనించిన దొంగలు శుక్రవారం తెల్లవారుజామున డబ్బుల దండ, హుండీని అపహరించుకుపోయారు. ఉదయం స్థానిక గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు గుర్తించి రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రూ.5 వేల వరకు నగదు ఉంటుందని ఉత్సవ కమిటీ సభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు.

వసతి గృహాల్లో పక్కాగా మెనూ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డా.కె వేణుగోపాల్

కర్నూలు సిటీ: జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాల్లో, ఏపీ మోడల్ స్కూల్ హాస్టళ్లలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను పక్కాగా అమలు చేయాలని సమగ్ర శిక్ష అదనపు కో–ఆర్డినేటర్ డా.కె వేణుగోపాల్ ఆదేశించారు. శుక్రవారం సమగ్ర శిక్ష కార్యాలయం సమావేశ మందిరంలో కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్స్ ప్రిన్సిపల్స్, హాస్టళ్ల వార్డెన్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వసతి గృహాల్లో అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, సచివాలయ ఆరోగ్య సిబ్బంది ఫోన్ నెంబర్లను నోటీస్ బోర్డులో ఉంచాలని సూచించారు. కిచెన్ గార్డెన్స్‌ను ఏర్పాటు చేసుకోవాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో సమన్వయం చేసుకుని విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలన్నారు. ప్రతి శనివారం కేజీబీవీల్లో సమగ్ర శిక్ష సిబ్బందితో అకాడమిక్ ఆడిట్ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఈఈ కర్రెన్న, జీసీడీఓ సునీత, ఏఎంఓ ప్రసాదు, అసిస్టెంట్ ఏఎంఓ శివ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మన్ననలు పొందాలి



పీఎంజే నూతన షోరూంను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (న్యూటౌన్): నాణ్యతా ప్రమాణాలు, వివిధ రకాల మోడల్స్‌తో పీఎంజే జువెల్లర్ వినియోగదారుల మన్ననలు పొందాలని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శుక్రవారం జ్యోతి మాల్ ఎదురుగా కొత్తగా ఏర్పాటు చేసిన పీఎంజే జువెల్లరీ షోరూమ్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, కార్పొరేటర్ కైపా పద్మలతారెడ్డి ,పీఎంజే బిజినెస్ హెడ్ శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు.


అంచనాలు సిద్ధం చేయండి

కర్నూలు (న్యూసిటీ) : బి.తాండ్రపాడు సమీపంలోని జగన్నాథ గట్టుపై ఉన్న ప్రభుత్వ ఐటీఐ కళాశాల భవనాల మరమ్మతులకు సమగ్రంగా అంచనాలు సిద్ధం చేసి వారం రోజుల్లోగా నివేదిక సమర్పించాలని చీఫ్ ఇంజినీర్ మాధవి సుకన్య ఆదేశించారు. శుక్రవారం ఆమె విజయవాడ నుంచి జిల్లా ఆర్‌అండ్‌బీ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ నాగరాజు, ఈఈ సురేష్ బాబు, డీఈ విజయ భారతి, ఏఈఈ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

పల్లకీలో ఆది దంపతులు

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీ దేవి, మహానందీశ్వరస్వామి దంపతులకు శుక్రవారం పల్లకీసేవ నిర్వహించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు శరభయ్యశర్మ.. స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకోత్సవం చేపట్టారు. గోమాతకు విశేష పూజలు చేసిన అనంతరం పల్లకీ వెంట ఊరేగించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

చిరుత కలకలం



పత్తికొండ–చక్రాళ్ల రోడ్డులోని కొండపై చిరుత

పత్తికొండ రూరల్: పత్తికొండ–చక్రాళ్ల రోడ్డులోని కొండ ప్రాంతంలో చిరుత సంచారం శుక్రవారం కలకలం రేపింది. రైతుల నుంచి విషయం తెలుసుకున్న ఫారెస్టు అధికారి రామ్మోహన్ కొండ ప్రాంతంలోని పొలాల వద్ద పరిశీలించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గతంలో కొన్నినెలల క్రిందట ఈ ప్రాంతంలో చిరుత పాదముద్రలను ఫారెస్టు అధికారులు సేకరించారు. తరువాత కొంతకాలం చిరుత జాడ కనిపించలేదు. తాజాగా చిరుత సంచారంతో రైతులు పొలానికి ఒంటరిగా వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. చిరుత సంచారంపై నిఘా ఏర్పాటు చేసి అవసరమైతే ఉన్నతాధికారుల సూచనల మేరకు బోను ఏర్పాటు చేస్తామని ఫారెస్ట్ అధికారులు చెప్పారు.

సంక్షిప్త సమాచారం

ప్రశాంతంగా పీజీ పరీక్షలు

కర్నూలు(న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలోని ఆరు కేంద్రాల్లో నిర్వహిస్తున్న పీజీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. శుక్రవారం జరిగిన పరీక్షకు 58 మందికి గాను 55 మంది విద్యార్థులు హాజరయ్యారని, ముగ్గురు మాత్రమే గైర్హాజరయ్యారని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన

కర్నూలు(రాజ్‌విహార్): ప్రమాదాలకు తావు లేకుండా బస్సులు నడపాలని రోడ్డు రవాణా సంస్థ కర్నూలు–2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక డిపో వద్ద డ్రైవర్లకు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే సంస్థ లక్ష్యమని, అందుకు బస్సులు నడపాలని సూచించారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

కర్నూలు(సెంట్రల్) : ఏపీ క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు, సీఐటీయూ ఓల్డ్ సిటీ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో పున్నమి గెస్టు హౌస్ సమీపంలో క్లాప్ డ్రైవర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అగ్రిమెంట్ ప్రకారం డ్రైవర్‌కు జీతం రూ.18,500 , పీఎఫ్, ఈఎస్‌ఐ, వీక్లీ ఆఫ్ వసతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సాయిబాబాకుమార్, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ధర్నా

కర్నూలు (టౌన్) : నగరపాలక పరిధిలో పనిచేసే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు చంద్రశేఖర్, పులగం మద్దిలేటి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక నగరపాలక కార్యాలయం వద్ద ఆ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టైం స్కేల్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, సరెండర్ లీవ్ తక్షణమే చెల్లించాలన్నారు. కార్మికులకు ఆదివారం రోజును పూర్తి సెలవు దినంగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శివకుమార్, శాలు, సునీత, శాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్) : గాజులదిన్నె ప్రాజెక్టు సామర్థ్యాన్ని 4.5 టీఎంసీల నుంచి 5.5 టీఎంసీల వరకు పెంచడంతో సమీపంలో ఉన్న భూములు కోల్పోయే రైతులకు న్యాయమైన పరిహారం అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

నగరపాలకలో అన్నదానం

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహానికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నగర మేయర్ బీవై.రామయ్య, నగర పాలక కమిషనర్ భార్గవ్‌తేజ, అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ పాల్గొని ఉద్యోగులకు ఆహారపదార్థాలు వడ్డించారు.

ఈ రోజు

నగరంలో విద్యుత్ కోత

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని కృష్ణానగర్ ప్రాంతంలో శనివారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు కల్లూరు ఎస్టేట్ ఆపరేషన్స్ ఏఈఈ నాగ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల కారణంగా అబ్బాస్ నగర్, షరీఫ్ నగర్, కృష్ణా నగర్, హౌసింగ్ బోర్డు, రామచంద్ర నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

శ్రీరాధాష్టమి

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరీ జగన్నాథ మందిరంలో శనివారం శ్రీరాధాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు జరుగుతాయని పేర్కొన్నారు.

వరుణయాగం

కర్నూలు కల్చరల్: జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో వరుణయాగం నిర్వహిస్తున్నట్లు సమితి నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, సహప్రధాన కార్యదర్శి కాళింగి నరసింహ వర్మ పేర్కొన్నారు. వినాయక్ ఘాట్‌లోని శనివారం ఉదయం 7 గంటల నుంచి యాగం ప్రారంభమవుతుందని తెలిపారు. లోక కల్యాణార్థం నగరంలోని వినాయక మండపాల నిర్వాహకులు సైతం తమ మండపాల వద్ద గణపతి, వరుణ యాగాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

28న టెంకాయల వేలం పాట

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురం సుంకులాపరమేశ్వరీదేవి ఆలయం వద్ద టెంకాయలను విక్రయించుకునేందుకు ఈనెల 28న వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాకృష్ణ శుక్రవారం తెలిపారు. ఆలయ చైర్‌పర్సన్ ఉమామహేశ్వరి అధ్యక్షతను నిర్వహించనున్న వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.10,000 డిపాజిట్ చెల్లించాలన్నారు. అలాగే పూలు, నిమ్మకాయలను విక్రయించుకునేందుకు కూడా వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు.